క్లుప్తంగా

సీతమ్మధార రైతుబజార్ స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ ఆదేశాల మేరకు ఆదివారం సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు ఈవో కొండబాబు డ్రా తీసి రైతులకు వాటి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 167 రైతుల కార్డులకు గానూ 123 స్టాళ్లకు డ్రా తీసి కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న దాతలు

సీతంపేట: రోటరీ క్లబ్ వాల్తేర్, రోటరీ బ్లడ్ బ్యాంక్, శంకర్ ఫౌండేషన్‌తో కలిసి స్థానిక రాజేంద్రనగర్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించాయి. 25వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా పాల్గొని కంటి సమస్యలున్న వారికి కళ్లద్దాలు అందజేశారు. పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వాల్తేర్ అధ్యక్షుడు నారాయణరావు, రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ జి.ఎస్.రాజు, రోటరాక్ట్ క్లబ్‌లు, స్థానిక నాయకులు గుదేరాజు, ఒమ్మి ఆనంద్, ఉప్పాడ సన్నీ, శంకర్ పాల్గొన్నారు.

సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని శ్రీ సత్య సాయి సేవా సంస్థలు, రైల్వే ఏరియా సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న వారికి ఉచితంగా శిక్షణ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఐసీడబ్ల్యూఏఐ భవన్ పక్కన, అక్కయ్యపాలెం హైవే వద్ద గల సత్యసాయిబాబా సాయిసౌధలో కోచింగ్ ఉంటుందన్నారు. ఈ నెల 10 నుంచి మే 13 వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. వివరాలకు 92480 52173, 63003 66227, 73860 86177 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

100 మందికి వైద్య పరీక్షలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థుల వసతిగృహంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అపోలో ఆస్పత్రికి చెందిన వైద్యుడు సుమంత్ సిన్హా బృందం విద్యార్థులకు వివిధ వైద్య పరీక్షలు చేవారు. ఈ శిబిరంలో 100 మందికిపైగా విద్యార్థులకు పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ డాక్టర్ సిహెచ్.ఆశా ఇమ్మానియల్ రాజు, వార్డెన్ డాక్టర్ కె.రాజమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

సరికొత్తగా వాకర్స్ పార్కు



క్లబ్ సభ్యుల పర్యవేక్షణలో జరుగుతున్న వాకర్స్ పార్కు సుందరీకరణ పనులు



వాకింగ్ ట్రాక్ వద్ద మొక్కలు నాటడానికి చదును చేసిన ప్రాంతం

- చురుగ్గా సుందరీకరణ పనులు
- బ్యూటిఫికేషన్, ఔషధ మొక్కల పెంపకం
- మొక్కల సంరక్షణకు ఏర్పాట్లు
- వాకర్స్ క్లబ్ సభ్యుల సహకారంతో అభివృద్ధి

మురళీనగర్: మురళీనగర్‌లోనే మొట్టమొదటి ఉద్యానవనంగా పేరొందిన వాకర్స్ పార్కు సుందరీకరణకు చర్యలు తీసుకున్నారు. ఈ పార్కును సరికొత్తగా తీర్చిదిద్దనున్నారు. వాకర్స్ క్లబ్ సభ్యుల సహకారంతో 15 రోజులుగా అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో పాడైపోయి ఎండిపోయిన బ్యూటిఫికేషన్ మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నాటుతున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రధాన మొక్కలన్నింటినీ సంరక్షించేందుకు అవసరమైన ఏర్పాటు చేస్తున్నారు. మొక్కలకు గొప్పులు తవ్వి వాటి మొదళ్లలో నీటిని పెట్టేందుకు పాడి తవ్వి ఎరువులు వేస్తున్నారు. కొత్తగా మొక్కలు నాటడానికి అవసరమైన సారవంతమైన మట్టి, సేంద్రియ ఎరువులను పద్మనాభం మండలంలోని గ్రామీణ ప్రాంతం నుంచి రప్పించారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ కొత్తగా క్రోటన్స్, అలంకరణ మొక్కలు నాటుతున్నారు. పార్కు పచ్చదనం పరిరక్షణే ధ్యేయంగా ప్రస్తుతం ఉన్న మొక్కలకు ఎటువంటి హాని జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



సిద్ధంగా ఉన్న ఎరువు

వృక్ష ప్రేమికుల పర్యవేక్షణ..

వాకర్స్ పార్కులో పూల మొక్కలు, అలంకరణకు ఉపయోగపడే మొక్కలతోపాటు ఆక్సిజన్‌ను ఎక్కువగా విడుదల చేసే మొక్కలు, ఔషధ మొక్కల పెంపకానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఈ పనులు వృక్ష ప్రేమికులు నిమ్మగడ్డ బుచ్చయ్య, టీవీ రమణ, ఎన్.ప్రకాశరావు నిత్య పర్యవేక్షణలో జోరుగా జరుగుతున్నాయి. గుబురుగా పెరిగే మొక్కలను వేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. బుద్ధుడి విగ్రహ ప్రాంగణంలో ప్రత్యేకంగా బుద్ధ వనం అభివృద్ధి చేయనున్నారు. బ్యూటిఫికేషన్‌కు క్లబ్ సాధారణ నిధులు రూ.50 వేలు కేటాయించారు. దీనికి తోడు పార్కు, వాకర్స్ క్లబ్ సభ్యులు శ్రమదానం చేస్తున్నారు.

జియో ట్యాగింగ్

పార్కులో ప్రత్యేకమైన మొక్కలు పెంచుతున్నారు. ఇప్పటికే అనేకమైన ఔషధ విలువలు కలిగిన మొక్కలతోపాటు నీడనిచ్చే వృక్షాలు ఉన్నాయి. ఇక్కడికి వచ్చే సందర్శకులకు దీన్ని విజ్ఞానవంతమైన పార్కుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా ప్రతి మొక్క లేదా చెట్టు వ్యవహారిక నామంతోపాటు శాస్త్రీయ నామం తెలియజేస్తూ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. వీటిని జియో ట్యాగింగ్ చేయాలని నిర్వాహకులు నిర్ణయించారు.

ఆదర్శ పార్కుగా తీర్చిదిద్దుతాం



మురళీనగర్‌లోని పార్కుల్లో వాకర్స్ పార్కును ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి చేశారు. గతంలో పనిచేసిన వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, వాకర్స్ సహకారంతో పార్కులో నూతన సౌకర్యాల కల్పనకు కృషి చేశాం. పచ్చదనం పరిరక్షణతోపాటు అందంగా తీర్చిదిద్దాలని ధ్యేయంగా ప్రస్తుతం పనులు చేపడుతున్నాం. ఇవన్నీ పూర్తి స్థాయిలో ఎదిగితే నగరంలోనే ఆదర్శ పార్కుగా రూపుదిద్దుకుంటుంది. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం క్లబ్ సభ్యులు తమ వంతుగా శ్రమదానం చేస్తున్నారు.

– పల్లా చంద్రమౌళి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు

పిల్లలకు ఆటపాటలూ ముఖ్యం



డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను సత్కరిస్తున్న విజయారెడ్డి, ఎన్‌వీ రెడ్డి

మురళీనగర్: పిల్లలకు విద్యతోపాటు ఆటపాటల్లో పాల్గొనేందుకు సమయం కేటాయించాలని తల్లిదండ్రులకు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సూచించారు. మురళీనగర్‌లోని హ్యాపీ ఫీట్ ప్రీస్కూల్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పిల్లలతో సమయం గడిపేందుకు తల్లిదండ్రులిద్దరూ ప్రాధాన్యమివ్వాలన్నారు. చైల్డ్ సైకియాట్రిస్ట్ డాక్టర్ ఎన్.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పిల్లల్లో మానసిక వికాసం పెంపొందించేందుకు ఆహ్లాదకర వాతావరణంలో పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, డాక్టర్ ప్రసన్నకుమార్‌లను పాఠశాల డైరెక్టర్ ఎస్.విజయారెడ్డి, ఎన్‌వీ రెడ్డి ఘనంగా సత్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాటిచెట్లపాలెంలో అన్నసంతర్పణ



అన్నదానం ప్రారంభిస్తున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: గవర తాటిచెట్లపాలెంలోని హనుమాన్ సీతారామ పంచాయతన ఆలయం వద్ద శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు, స్థానికులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ బీసీ సెల్ ప్రెసిడెంట్ బొడ్డేటి గంగా మహేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు పి.శంకరరావు, ఎస్.నూకరాజు, ఎస్.ఆంజనేయులు, బాల, రాజు, బి.జగదీశ్వరి, సూర్యప్రకాష్, గోవింద, గౌరి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దయానందనగర్‌లో..

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం దయానందనగర్‌లో వెలసిన నూకాంబిక అమ్మవారి వేడుకల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆర్థిక సాయంతో ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు ఆడారి శ్రీను, మజ్జి నూకరాజు, గ్రామాధ్యక్షుడు డి.అప్పలరాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 5 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారని గ్రామ కార్యదర్శి బోని ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పి.రాజు, వి.రాజు, కె.నూకరాజు, ఎం.కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు డి.ఎస్.మణికంఠ, వి.ప్రసాద్, ఎం.కార్తీక్, ఎం.ముత్యాలమ్మ, కాంతమ్మ, పి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరం

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ఎండోక్రోనాలజీ(ఏసీఈ) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీ సెక్టార్–10లోని ఆస్పత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. డయాబెటీస్, నేత్ర, థైరాయిడ్, బ్లడ్ సుగర్ తదితర సమస్యలకు ఉచిత పరీక్షలు నిర్వహించనున్నారు. ఆస్పత్రి ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ క్యాంప్ జరగనుందని డాక్టర్ రవితేజ తెలిపారు.

రాయల కాలం స్వర్ణయుగం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ రఘురామారావు

సీతంపేట: విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం 'శ్రీకృష్ణ దేవరాయల కవితాత్మక వ్యక్తిత్వం' అనే అంశంపై సాహిత్య కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి రచయిత డి.వి.సూర్యారావు కృష్ణ దేవరాయల చరిత్రను, విజయనగర సామ్రాజ్య వైభవాన్ని వివరించారు. రాయల కాలం దక్షిణ భారతదేశ చరిత్రలో స్వర్ణయుగమని అభివర్ణించారు. గౌరవ అతిథి మేడా మస్తాన్‌రెడ్డి విశాఖ రసజ్ఞ వేదిక సాహితీ సేవలను ప్రస్తుతించారు. డాక్టర్ మరడాన సుబ్బారావు రాయల అముక్తమాల్యద కవితా విశేషాలు వివరించారు. కావ్యంలోని ప్రధాన ఘట్టాలను విశ్లేషించారు. ముందుగా అతిథులంతా కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు సాహితీవేత్తలు, రచయితలు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



శ్లీవ్ గుర్తు వీధిలో మట్టలకు ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్



జ్ఞానాపురం వీధిలో మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం: జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయంలో రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో ఆదివారం మట్టల పండగను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మట్టలతో జ్ఞానాపురం వీధుల్లో ప్రార్థనలు చేశారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, దివ్యబలి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఫాదర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జెరూసలేం పట్టణంలోకి వచ్చే సమయంలో నాటి ప్రజలు చెట్టు కొమ్మలతో స్వాగతం పలికారన్నారు. ఈ సందర్భంగా ప్రతి తపస్సు కాలంలో మట్టల ఆదివారం నిర్వహిస్తారన్నారు. సహాయ విచారణ కర్తలు బైబిల్ చదివారు. ఈస్టర్ వరకు ప్రతి ఒక్కరూ ప్రతి రోజు చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు ఆదిరెడ్డి చార్లీ, ఆనందరావు, బి.జోసెఫ్, క్రైస్తవులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- అరగంట ముందే సెంటర్‌కు చేరుకోవాలి
- 'ఉత్తర'లో 18 పరీక్ష కేంద్రాలు



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట: విద్యార్థి దశలో అత్యంత కీలకమైన పదో తరగతి ఫైనల్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఎగ్జామ్స్.. రోజు విడిచి రోజు చొప్పున ఈ నెల 18 వరకు జరగనున్నాయి. ఉత్తర నియోజకవర్గంలోని 8 జీవీఎంసీ, 2 ఎయిడెడ్, 8 ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు 3,859 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. గతేడాది ఏడు పేపర్లను ఈసారి ఆరు పేపర్లకు కుదించారు. ఈ సారి ఫిజిక్స్, బయాలజీ కలిపి ఒకే పేపర్‌గా రాయాల్సి ఉంటుంది. ఉదయం 9.30 నుంచి 12.45 వరకు పరీక్ష జరుగుతుంది. అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. 8.45 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని, 9.30 గంటలు దాటాక ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు వంటి సదుపాయాలు, పోలీస్ బందోబస్తు కల్పించారు.

25, 26 వార్డుల్లో..

25వ వార్డు సీతంపేట మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో టెన్త్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ 220 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. తరగతి గదికి 20 మందిని కేటాయించారు. కేంద్రానికి అరగంట ముందు చేరుకోవాలని హెచ్‌ఎం శాంతికుమారి తెలిపారు. రాజేంద్రనగర్ వీటీ హైస్కూల్‌లో 220 మంది, 26వ వార్డు లలితానగర్ జ్ఞాననికేతన్ ఎయిడెడ్ హైస్కూల్‌లో 210 మంది, అక్కయ్యపాలెం, ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో 167 మంది పరీక్ష రాయనున్నారు.

పటిష్టమైన చర్యలు

- ఈ ఏడాది ప్రతి ప్రశ్నాపత్రంపై సీరియల్ నంబర్ ముద్రించారు. ఒకవేళ ప్రశ్నాపత్రం లీకైతే ఏ సెంటర్ నుంచి లీకయిందో ఇట్టే తెలుసుకోవచ్చు.
- ఎటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌తో సహా ఇన్విజిలేటర్లు ఎవరూ సెల్ ఫోన్ సెంటర్‌లోకి తీసుకెళ్ల కూడదు.

పకడ్బందీ ఏర్పాట్లు



ఆర్పీ పేట ఉన్నత పాఠశాలలో సిద్ధం చేసిన తరగతి గది

కంచరపాలెం: పదో తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట, కప్పరాడ తదితర జీవీఎంసీ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. హాల్ టికెట్ల నంబర్ల వారీగా విద్యార్థులకు రూమ్‌లు కేటాయించారు. పరీక్షా సమయంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. జ్ఞానాపురంలోని సేక్రెడ్ హార్ట్ బాలికోన్నత పాఠశాల, సెయింట్ పీటర్స్ బాలుర హైస్కూల్, జూబ్లీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఐటీఐ కూడలిలోని కప్పరాడ ఉన్నత పాఠశాల, కరాసలో స్టెల్లామేరీస్ ఇంగ్లిష్ మీడియం స్కూళ్లల్లో పరీక్ష కేంద్రాలు సిద్ధమయ్యాయి. ఆర్పీ పేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 192 మంది, కప్పరాడ హైస్కూల్‌లో 168 మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గౌరీనగర్‌లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాసరి శామ్యూల్ ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పల్లా ఎర్నికుమార్ యాదవ్, పార్టీ నాయకురాలు సర్వసిద్ధి సాయిలత పాల్గొన్నారు.

గౌరీ సేవా సంఘానికి కొత్త కార్యవర్గం



గౌరీ సేవా సంఘం(పోర్టు) నూతన కార్యవర్గ సభ్యులు

సీతంపేట: శ్రీగౌరీ సేవా సంఘం(పోర్టు విభాగం) 2023–25 కాలానికి నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్ వద్ద శ్రీనివాస క్యాస్టిల్‌లో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా విల్లూరి వరహా సత్యనారాయణ, అధ్యక్షుడిగా సూరిశెట్టి జగ్గప్పారావు, కార్యదర్శిగా పాలమరశెట్టి ఎస్.జె.వి.ప్రసాద్, కోశాధికారిగా రాపేటి చంద్రరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్.లోకేశ్వరరావు, దాడి వరహా వెంకటరామారావు, కె.ఆర్.కె.ఎస్.అప్పారావు, ఆడారి కిషోర్ కుమార్, కె.వి.సుందర్, ఉప కార్యదర్శులుగా కొణతాల మల్లిక్, కాళ్ల వరప్రసాదరావు, రాపేటి కృష్ణ అప్పారావు, దాడి ఈశ్వరరావు, యల్లపు కోటేశ్వరరావు, ఉప కోశాధికారిగా నియామకమయ్యారు. మరో ఐదుగురు సభ్యులతో ఫైనాన్స్ కమిటీ ఎన్నికైంది. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన సభ్యులకు సన్మానం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర గౌరీ గవర సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, కార్యదర్శి లచ్చప్పారావు, ఎన్నికల అధికారి బొడ్డేటి భాస్కర్, ఆళ్ల అప్పలరాజు పాల్గొన్నారు.

మంచిగా జీవించండి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ సింహాద్రినాయుడు



రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ మోహన్‌రావు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ సీహెచ్ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లకు పలు సూచనలిచ్చారు. నేరాల జోలికి పోకుండా మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. గొడవలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని నేరాలకు దూరంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని రౌడీ షీటర్లను సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మేంద్ర, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో..

ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు ఎస్ఐ మోహన్‌రావు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు.

పెరుగుతున్న మట్టి పాత్రల వినియోగం



శిల్పారామంలోని గాంధీ బజారులో విక్రయానికి ఉంచిన టెర్రకోట కుండలు

పీఎం పాలెం: మట్టిపాత్రలకు మరలా పూర్వ వైభవం వస్తోంది. రాగి, స్టీలు, ఇత్తడి, అల్యూమినియంతో తయారు చేసిన పాత్రల వినియోగం కొన్నేళ్లుగా అధికమయింది. దీంతో మట్టికుండలు తెరమరుగయ్యాయి. గత తరంలో ప్రధాన గ్రామీణ వృత్తుల్లో కుండల తయారీ వృత్తి ఒకటి. పెద్దపెద్ద జాడీలు మొదలుకుని అన్నం వండడానికి కుండల వరకూ వివిధ సైజులలో ప్రత్యేకంగా పాత్రలు తయారు చేసేవారు. అయితే ఆధునిక యువతకు మట్టికుండల వినియోగం, తయారీపై కనీస అవగాహన శూన్యం. ఈ క్రమంలో ప్రస్తుతం మట్టి కుండల్లో వండిన ఆహార పదార్థాలు తింటే ఆరోగ్యపరంగా ఎంతో మంచిదని డాక్టర్లు, ప్రకృతి ఆరోగ్య అభిలాషులు, పలువురు నిపుణులు చెప్పడంతో మరలా ప్రజల దృష్టి మట్టి పాత్రల వైపు మరలింది. దీంతో వాటి తయరీ, అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా టెర్రకోట మట్టి పాత్రలకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. వినియోగదారుల అవసరాలు గుర్తించి మట్టి పాత్రలు తయారు చేసి విక్రయిస్తున్నామని శిల్పారామంలోని స్టాల్ నిర్వాహకులు తెలిపారు.

భానునగర్‌లో పార్కు ప్రారంభం

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు భానునగర్‌లో ఆధునీకీకరించిన విద్యానగర్ పార్కును ఆదివారం కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ప్రారంభించారు. పార్కులో ఓపెన్ జిమ్‌ను, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. వీటితో పాటు చిన్నారులు ఆడుకునేలా పరికరాలు పార్కులో ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని కార్పొరేటర్ లక్ష్మి తెలిపారు. వాకింగ్ ట్రాక్ అందుబాటులో ఉందన్నారు. పార్కును సద్వినియోగం చేసుకుని, చక్కగా నిర్వహణ చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు ఒమ్మి పోలరత్నం, తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లు విసురుతున్న సాంకేతిక మార్పులు



ప్రసంగిస్తున్న కామత్



పాల్గొన్న ఏయూ ఆచార్యులు, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: మారుతున్న సాంకేతికత.. ఉపాధి అవకాశాల కల్పనలో సవాళ్లు విసురుతోందని విప్రో సంస్థ హెచ్‌ఆర్ విభాగం జీఎం కె.ప్రవీణ్ కామత్ అన్నారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ విద్యార్థులను ఉద్దేశించి కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో ఆదివారం ప్రత్యేక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బహుళ నైపుణ్యాలు కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్తులో నూతనంగా అవతరించే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యాలను కలిగి ఉండాల్సిన విధానాలను తెలియజేశారు. హెచ్‌ఆర్ రంగంలో వస్తున్న నూతన పోకడలు, అవకాశాలు వివరించారు. ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే విధానం, ప్రణాళిక, అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలలో 85 శాతానికి పైగా రానున్న రెండు దశాబ్దాల కాలంలో కనుమరుగవుతాయన్నారు. అధునాతన సాంకేతికతను మిళితం చేస్తూ అభ్యసనం చేసే వారికి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ రంగంలో విద్యార్థులకు ఎదురయ్యే సవాళ్లను ప్రత్యక్షంగా తెలియజేయడానికి ఈ ప్రత్యేక ప్రసంగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డాక్టర్ ఎస్.కె.ప్రసాద్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు, ఏయూ సిబ్ ఏవో డాక్టర్ సారాబంది, తదితరులు పాల్గొన్నారు.